నా మాటే శాసనం..!

- కేడర్ సూచనలు పరిగణనలోకి తీసుకోని శ్రీకాకుళం ఎమ్మెల్యే
- ఏకపక్షంగా నిర్ణయాలు తగవంటున్న 'దేశం' నేతలు
- ఆలయ పాలకవర్గాల ఎంపికపై విమర్శలు



శ్రీకాకుళం : శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలపై ఆ పార్టీ నాయకుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీకి సంబంధించి రెండు వర్గాలు ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే వెంట తిరిగే కొందరు సైతం ఆయన నిర్ణయాలను తప్పుపడుతున్నారు. తాజాగా చిన్న బజారులోని దూది వారి కోవెల పాలకమండలి చైర్‌పర్సన్‌గా హరితను నియమించడాన్ని టీడీపీ నాయకులు ఆక్షేపిస్తున్నారు. ఇటీవలే ఆమె పార్టీ సభ్యత్వం తీసుకోగా, ఆమె భర్తపై పలు కేసులు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ డివిజన్ నాయకుడు చైర్మన్ పదవిని అమ్ముకున్నారని వారంతా ఆరోపిస్తున్నారు. తొలి నుంచి ఈ విమర్శలు వినిపిస్తున్నప్పటికీ శాసనసభ్యుడు పట్టించుకోకుండా ప్రమాణ స్వీకారం సైతం చేయించేశారు. అలాగే ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా పాండ్రంకి దేవేందర్ నాయుడును నియమించడాన్ని కూడా పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఈయన కొంత కాలం టీడీపీని వీడి జనసేనలో చేరడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. అదే విధంగా కృష్ణా పార్కు సమీపంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా పుప్పాల చినమాలక్ష్మిని నియమించగా, ఆమె తొలి నుంచి పదవిని తిరస్కరిస్తున్నా పెడచెవిన పెట్టి ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాట్లు చేశారు. తీరా ఆమె కార్యక్రమానికి రాకపోవడంతో కేవలం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే ఆలయంలో ఉన్న సత్రానికి కూడా పాలకమండలిని నియమించి చైర్మన్‌గా కెల్ల కిషోర్‌ను నియమించారు. ఒకే ఆవరణలో ఉన్న ఈ రెండింటిని విడగొట్టడం, డివిజన్‌లోనే కాకుండా నగరంలోని కూడా కొంత పట్టు ఉన్న కిషోర్‌ను సత్రం కమిటీకి మాత్రమే పరిమితం చేయడం సరైన చర్య కాదని నగడ క్యాడర్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించేందుకు ఎమ్మెల్యే జ్ఞాపికలు, శాలువాలను పంపించారు. స్థానిక నాయకులు వీటిని వినియోగించి ఉపాధ్యాయులను సన్మానించాలని ఆయన సూచించారు. ఇందుకు భిన్నంగా నియోజకవర్గంలోని నాలుగు చోట్ల కార్యక్రమం జరగడం విమర్శలకు తావిచ్చింది. ఇందుకు ఉదాహరణగా నగరంలోని దమ్మలవీధి పాఠశాలను చెప్పవచ్చు. డివిజన్ ఇన్‌చార్జిగా కేశవ రాంబాబు ఉండగా, అక్కడ పాఠశాలలో ఒక మాజీ రౌడీ షీటర్ ఉపాధ్యాయులను సత్కరించడం ఆక్షేపణీయమని ఆ డివిజన్ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

నగర కార్యవర్గం ప్రకటన ఎప్పుడో?

శ్రీకాకుళం నగర పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించలేని పరిస్థితులు నెలకొన్నాయి. నగర పార్టీ అధ్యక్షుడిగా పాండ్రంకి శంకర్‌ను, కార్యదర్శిగా ఇప్పిలి తిరుమలరావును నియమించేందుకు నిర్ణయం తీసుకున్నా రెండు నెలలుగా ప్రకటించలేకపోతున్నారు. పాండ్రంకి శంకర్ గతంలో ప్రజారాజ్యం పార్టీకి వెళ్లి తిరిగి టీడీపీలో చేరడం, ఇటీవల ఓ పోలీస్ కేసులో ఇరుక్కోవడం తోపాటు ఈయన సోదరుడిని కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా నియమించడంతో క్యాడర్ కొంత అసంతృప్తితో ఉన్న విషయాన్ని ఆయన వద్దే చెప్పడం వల్ల కాస్త తటపటాయించారు. అయినా శంకర్‌నే నియమించాలని నిర్ణయించారు. ఇటీవల పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పాండ్రంకి శంకర్ అంతంత మాత్రంగా పాల్గొనడం, కార్యదర్శిగా నియమించాలనుకుంటున్న ఇప్పిలి తిరుమలరావుపై సైతం ఆరోపణలు వస్తుండటంతో కార్యవర్గం ప్రకటనలో జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు. అలాగే కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ పదవిని కాలింగ కులానికి చెందిన వ్యక్తిని నియమిస్తూ ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలువడగా, అది పొరపాటున జరిగినట్టు చెబుతూ రద్దు చేసినప్పటికీ, తిరిగి దానిని సరిదిద్దుతూ నియామకం చేపట్టకపోవడాన్ని కళింగ కోమట్లు తప్పుపడుతున్నారు. ఇది జరిగి సుమారు నెలన్నర కావస్తున్నా ఉత్తర్వులు వెలువరించేలా రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తేకపోవడాన్ని కళింగ కోమట్లు ఆక్షేపిస్తున్నారు. ఇలా అనేక నిర్ణయాలు పట్ల స్వపక్షం నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

అన్నప్రసాద వితరణ



అన్నదానం నిర్వహిస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని గోనెలవారి వీధి, అడంగివారి వీధి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యుగంధర్, సాయి, రాజా, శ్రీను, మూర్తి, గిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మూలమంత్ర సహిత హవనం జరిగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జానపద నృత్య పోటీల్లో ప్రతిభ



గైడ్ టీచర్‌తో విద్యార్థినులు

జి.సిగడాం: జిల్లా స్థాయి జానపద నృత్య పోటీల్లో జి.సిగడాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఇటీవల వమరవిల్లి డైట్ కళాశాలలో కళా ఉత్సవ్‌లో భాగంగా వివిధ జానపద నృత్యాలను ప్రదర్శించారు. డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్ చేతుల మీదుగా ఆదివారం బహుమతులు అందుకున్నారు. గైడ్ టీచర్‌గా తెలుగు అధ్యాపకులు కోట తిరుపతి రావు, డీహెచ్ఎస్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. వీరిని ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

నగదు రూపంలో విరాళాలు వద్దు

శ్రీకాకుళం అర్బన్: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో నవంబర్ 5న కార్తీక పౌర్ణమి నాడు నిర్వహించే బాలి జాతరకు నగదు రూపంలో ఎటువంటి విరాళాలు స్వీకరించడం లేదని అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు. శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొందరు దళారులు బాలియాత్ర పేరిట విరాళాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా ఇవ్వాలనుకుంటే తాగునీరు, టెంట్లు, మందుగుండు సామాగ్రి వంటి వస్తు రూపంలో మాత్రమే ఇవ్వాలని కోరారు.

కౌమార బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రణస్థలం: మానసిక ప్రశాంతత, క్రీడలు, వ్యాయామం, యోగా చేయడం వల్ల కౌమార బాలికల ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా ప్రసూతి, స్త్రీ వ్యాధుల వైద్య బృందం సభ్యులు రేవతి, ప్రశాంతి, హరిత అన్నారు. రణస్థలం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో యూత్ క్లబ్ బెజ్జిపురం, స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కౌమర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. 60 మంది బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందించారు. మందులు, శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం జోనల్ ఇన్‌చార్జి వైద్యులు అరవింద్, డాక్టర్ ప్రమీల, బాలికల వసతి గృహ సంక్షేమాధికారి ప్రవీణ, యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ కమ్యూనిటీ ఆర్గనైజర్ ఇజ్జాడ రాధ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు పందిరి రాట



పందిరిరాట వేస్తున్న భక్తులు,కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల/జి.సిగడాం: ఎచ్చెర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు జరుగుళ్ల శంకరరావు ఆధ్వర్యంలో దుర్గాదేవీ నవరాత్రులకు సంబంధించి ఆదివారం పందిరిరాట వేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జి.సిగడాం మండలం ఎస్.పి.ఆర్.పురంలో ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పందిరిరాట వేశారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని వాడాడ, అచ్చెన్నపాలెం పరిసరాల్లో మూడు చోట్ల పేకాట ఆడుతున్న 14 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం జరిపిన దాడుల్లో వారి వద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్.గంగరాజు తెలిపారు. కొత్తూరు సైరిగాంలో 38 క్వార్టర్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

డ్రోన్‌తో ద్రావణాలు పిచికారీ



కోష్టలో డ్రోన్‌తో పిచికారి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రణస్థలం: పంట సాగులో ఖర్చు తగ్గించేలా సాంకేతికత పరిజ్ఞానాన్ని జోడిస్తున్ను ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అన్నారు. కోష్ట గ్రామంలో రైతు పిషిని జగన్నాథం పొలంలో వరి పంటపై ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణాన్ని డ్రోన్‌తో పిచికారి చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జ్ కొయ్య రాంబాబు, డీఎంఎంటీ గంట్యాడ రాంబాబు, సత్యనారాయణ, డిజిటల్ కలివరపు శివశంకర్, ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు పిసిని సంతోషి, రైతులు పాల్గొన్నారు.

విప్లవభావాలు కలిగిన కవి ఛాయారాజ్



నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: విప్లవభావాలు కలిగి, శ్రామిక ప్రజల జీవన విధానాలు కథా వస్తువులుగా రచనలు చేసే కవి ఛాయారాజ్ అని వక్త సనపల నారాయణమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'మన మహాకవి–ఛాయారాజ్' అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. గార మండలానికి చెందిన ఛాయారాజ్ రచనలు ప్రాంతీయ భాషలోనే సాగాయన్నారు. శ్రీకాకుళం ఉద్యమాన్ని వివరించిన 'శ్రీకాకుళం' పుస్తక రచన ద్వారా మంచి పేరు వచ్చిందన్నారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కోమల రావు, నరసింహమూర్తి, పట్నాయిక్, విశ్వేశ్వర రావు, చంద్రరావు, సింహాచలం, బాబూరావు, ఉమారాణి, అరుణ, సరస్వతి, లక్ష్మీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా దేశభక్తి గేయాల పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం యువ రచయితల వేదిక శ్రీకాకుళం, తంగి ఎర్రమ్మ అధ్యక్షతన దేశ భక్తి గేయాలు, తెలుగు భాషా ఔన్నత్యపు గేయాల పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో పిస్నేహిత, జి.చాందిని, పి.భవిష్య, సీనియర్ విభాగంలో దివ్య భవాని, హరీష్ ప్రధాన్, అన్నెపు భాస్కరరావులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పిలకా శాంతమ్మ, సాయి ప్రశాంతి, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డా.వినోద్ కుమార్, ఇందిరా ప్రసాదరావు, జి.దామోదర రావు, చింతాడ తిరుమలరావు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయమని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, జిల్లా కో-కన్వీనర్లు గురుగుబెల్లి భాస్కరరావు, అట్టాడ తిరుమలేశ్వరరావు, మందస మండల కన్వీనర్ సార భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తూ పర్యావరణం చైర్మన్‌గా అత్యుత్తమ పర్యావరణ సేవలు అందించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థలో శ్రీకాకుళం జిల్లా నుంచి నూతనంగా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన లయన్ పొన్నాడ రవికుమార్‌ను అభినందించారు.

ఎచ్చెర్ల: వర్సిటీ ప్రగతికి సహకరించాలని బీఆర్ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయడును కోరారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలను చేపట్టిన తరువాత తొలిసారిగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎచ్చెర్ల : ట్రిపుల్ ఐటీ కళాశాలకు చెందిన స్టూడెంట్ వెల్ఫేర్ డీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి ఇటీవల గౌహతి ఐఐటీ పీహెచ్‌డీ పట్టా అందుకున్న నేపథ్యంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ శంకర్‌లు శుక్రవారం అభినందించారు. ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా అభినందనలు తెలియజేశారు.

కె.సైరిగాంలో కార్డన్ సెర్చ్



సీజ్ చేసిన బైక్‌లు

గార: మండలంలోని కొత్తూరు సైరిగాంలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ సీహెచ్ గంగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామమంతా గాలింపు చేపట్టారు. నాలుగు బైక్‌లకు పత్రాలు లేనందున సీజ్ చేశారు. మాదకద్రవ్యాలు కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బృందావనంలో అష్టమి భజనలు



భజన గీతాలపిస్తున్న భక్తులు

గార: మండలంలోని జొన్నలపాడు జంక్షన్ బృందావనంలో ఆదివారం బహుళాష్టమి భజనలు నిర్వహించారు. శ్రీకాకుళం మంగువారితోట తారక రామ భజన బృందం సభ్యులు భజన గీతాలు ఆలపించారు. భజన బృందం వ్యవస్థాపకులు జగలంకి శ్రీనివాసరావు, సభ్యులను బృందావనం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చౌదరి దుర్గారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ , లయన్స్ క్లబ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డాక్టర్ షర్మిలకు గోల్డ్ మెడల్



ప్రశంసాపత్రం అందుకుంటున్న షర్మిల

అరసవల్లి: నగరానికి చెందిన షుగర్, థైరాయిడ్ విభాగ వైద్యురాలు డాక్టర్ పల్లె షర్మిలకు డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్ (డీఎం-ఎండోక్రినాలజీ)లో మొదటి ర్యాంకు సాధించినందుకు హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాల వైస్ చాన్స్‌లర్ ప్రతినిధులు ఆదివారం గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈమె శ్రీకాకుళం రిమ్స్‌లో ఎంబీబీఎస్, విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎండీ జనరల్ మెడిసిన్‌లో కూడా బంగారు పతకాలను సాధించారు.

హిందీ టీచర్‌కు సత్కారం



ఆదిలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పాలఖండ్యాం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ హిందీ పక్షోత్సవాల సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు ఉప్పలపాటి ఆదిలక్ష్మిని ఆదివారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం రుద్రపాటి లక్ష్మికుమారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, ఎందువ వెంకటరమణ, వెలగాడ రాము, ముళ్ల సుజాత, ఎం.పెంటయ్య, పిల్లల దాలెమ్మ పాల్గొన్నారు.